# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. సామాజిక పరివర్తన, దేశ నిర్మాణం విద్య ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.
2. గ్రామస్థాయిలోనూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకి త్వరలో వెయ్యి కొత్త బస్సులు రాబోతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.
4. రెపోరేటు ను 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు.
5. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చివరిఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమానికి ఈ రోజుతో 82 సంవత్సరాలు పూర్తయ్యాయి.

==========================

సామాజిక పరివర్తన, దేశ నిర్మాణం విద్య ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న రాష్ట్రపతి ఆ దేశ రాజధాని వెల్లింగ్టన్‌లో జరిగిన న్యూజిలాండ్ అంతర్జాతీయ విద్యా సదస్సులో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 21వ శతాబ్దంలో భారతదేశ విద్యావ్యవస్థ గణనీయమైన పాత్రను పోషిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విభిన్న రంగాలకు తగిన నాయకులను భారత్ అందించిందని రాష్ట్రపతి పేర్కొంటూ..

వాయిస్ (41 సెకన్లు )

ఇలా ఉండగా న్యూజిలాండ్లో రెండు రోజుల పర్యటనలో భాగంగా వెల్లింగ్టన్ చేరుకున్న రాష్ట్రపతి ఘన స్వాగతం లభించింది. న్యూజిలాండ్ గవర్నర్ జనరల్, డామ్ సిండి కిరో, ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్, ఉప ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్‌తో ద్రౌపది ముర్ము సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ– ఏపీఎస్‌ఆర్టీసీకి త్వరలో వెయ్యి కొత్త బస్సులు రాబోతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో నిన్న

14 బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే 400 బస్సులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఏపీఎస్ఆర్టీసీని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో మహిళలకు హామీ ఇచ్చిన విధంగా త్వరలో ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు.

---------------------------

రెపోరేటు ను 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా– ఆర్ బి ఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ముంబైలో పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను ఈ రోజు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశ స్థూల జాతీయోత్పత్తి – జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతం, ద్రవ్యోల్బణం 4.5 శాతంగా వేస్తున్నామని చెప్పారు.ఏప్రిల్ – మేలో స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం జూన్‌లో పెరిగిందని, ఆహార పదార్థాల ధరలు పెరగడమే దీనికి కారణమని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణ అసమతుల్యంగా ఉందని భారత సేవా రంగ కార్యకలాపాలు బలంగా ఉన్నాయన్నారు. భారత కరెన్సీ రూపాయి మారకం విలువ పరిమిత శ్రేణిలోనే కొనసాగుతోందని తెలిపారు.

---------------------------

గ్రామస్థాయిలోనూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని పురుషోత్తపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిడదవోలు నియోజకవర్గంలో అంతర్గత రహదారులు అభివృద్ధికి 11 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. మూడు మండలాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలుపుతూ..

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తిరుపతి డివిజన్ వస్తు సేవల పన్ను–జిఎస్టి కేంద్ర కార్యాలయం జాయింట్ కమిషనర్ ఆర్.హరిహరన్ పిలుపునిచ్చారు. ఈరోజు తిరుపతిలోని జీఎస్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ప్రభుత్వ శాఖలో అతిపెద్ద రక్తదాన శిబిరాన్ని మొదటిసారి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతి రెండు వారాలకు ఒకసారి ఖచ్చితంగా రక్తం అవసరమని.. వారిని దృష్టిలో ఉంచుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొంటూ,

వాయిస్ ( 32 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో చేపట్టిన ఈ–పంట డిజిటల్ యాప్‌లో వాస్తవ సాగుదారుల పేర్లనే నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని కమిషనరేట్‌లో వెబ్ యాప్‌పై నిన్న నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తాము సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని, పంటల బీమా, వడ్డీలేని పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల అమ్మకానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ–పంట నమోదులో

నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ-పంటకు సంబంధించి క్షేత్ర సిబ్బందికి లాగిన్, ఐడీలు ఇచ్చామని ఆయన వివరించారు.

---------------------------

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దాన్ని అమలు చేసే క్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈరోజు నుంచి మూడు రోజులపాటు జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ సంచాలకులు ఎండీ దివాన్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల కేంద్రాల నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ, వాటిపై విశ్లేషణ, వీధి దీపాల నిర్వహణ వంటి కీలక అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారని వివరించారు. దీనికి సంబంధించి జిల్లా పరిషత్, జిల్లా పంచాయితీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు.

---------------------------

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చివరిఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమానికి ఈ రోజుతో 82 సంవత్సరాలు పూర్తయ్యాయి. 1942 ఆగస్టు 8వ తేదీన ముంబైలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో జాతిపిత మహాత్మాగాంధీ ప్రసంగిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌ను వదిలివెళ్లాలని హెచ్చరించారు. అందుకు అనుగుణంగా జాతియావత్తు ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆ మహనీయుని పిలుపుతో దేశవ్యాప్తంగా నిరసన ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం జాతీయ నాయకులను పెద్ద సంఖ్యలో జైళ్ళకు తరలించింది. అయినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కొనసాగడంతో బ్రిటీష్ ప్రభుత్వం భారత్ కు స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది.

---------------------------

ఏలూరు జిల్లా చింతలపూడిలోని తమ్మిలేరు జలాశయంలోకి వరద నీరు చేరడంతో అమీనాపేట వద్ద గల బ్రిడ్జి పైనుండి వరద నీరు ప్రవహిస్తున్న క్రమంలో వాహనాల రాకపోకలు నిషేధించినట్లు ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ తెలిపారు. అధికారులతో కలిసి బ్రిడ్జి ప్రాంతాన్ని డిఎస్పి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద ఉధృతి తగ్గేంతవరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని, శనివారంపేట వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రత్నామ్యాయ మార్గాల్లో దారి మళ్ళించినట్లు చెప్పారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

=====================